క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించేలా చూడండి

రాయచోటి అర్బన్ : తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా చూడాలని సమగ్రశిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి విన్నవించారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెను పురస్కరించుకుని వారు కలెక్టరేట్ వద్ద శ్రీకాంత్‌రెడ్డిని కలుసుకుని తమ సమస్యలను తెలుపుతూ వినతిపత్రం అందజేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తానంటూ చెప్పారు.

ప్రగతి కుబేర్‌కు విశేష స్పందన

నందలూరు(రాజంపేట) : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ తీసుకొచ్చిన ప్రగతి కుబేర్‌కు ఖాతాదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని సీనియర్ మేనేజరు(ఆర్‌ఓ) భాస్కర్‌రెడ్డి, నందలూరు బ్రాంచ్ మేనేజరు ఎస్. అరుణ్‌లు అన్నారు. బుధవారం ప్రగతి కుబేర్ డిపాజిట్స్ మండల వ్యాప్తంగా ఖాతాదారులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీబీ సిబ్బంది శ్రీరాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

రాయచోటి అర్బన్ : ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆర్టీసీ యూనియన్(సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీదాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆర్టీసీ కార్మికులతో కలసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిపో హెడ్ క్లర్క్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, భోగేశ్వరయ్య, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఇటీవల అమలులోకి వచ్చిన భూ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో 29న జరుప తలపెట్టిన భారీ ర్యాలీని జయప్రదం చేయాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, న్యాయవాదుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు రాజకుమార్‌రాజులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భూ హక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 29న శుక్రవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో న్యాయవాదులు ధనుంజయ, సిద్దయ్య, టి.వి.రమణ, సుబ్బరాయుడు, బి.వి.రమణ, బాస్ నేతలు తాతయ్య, రామక్రిష్ణ, అక్బర్, రెడ్డెయ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరలింగేశ్వరుడికి పూజలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీమంగళ గౌరీ సమేత అమరలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచే వేద పండితులు మహన్యాస రుద్రాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున శివునికి మహన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తే సకల దోషములు తొలగిపోయి ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని చెప్పారు. పూజల్లో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. భక్తులకు బోగా కుమార్, సౌభాగ్య దంపతులు తీర్థప్రసాదాలను అందజేశారు.

గ్రామ ప్రజావసరాలకు భూమినివ్వండి



రీ సర్వే డీటీకి వినతి పత్రం అందిస్తున్న శరత్ కుమార్‌రాజు, భాస్కర్‌రాజు తదితరులు

రాజంపేట రూరల్: తమ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రజల అవసరాలకు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, డీ బాస్కర్‌రాజులు కోరారు. ఎస్.ఎర్రబల్లి గ్రామ ప్రజలతో కలిసి బుధవారం వారు తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల రీ సర్వే డీటీ హరితకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంజీ పురం గ్రామ పంచాయతీలోని ఎస్.ఎర్రబల్లిలో సర్వే నంబరు 1274/1, 1274/2లో 14 ఎకరాలున్న ప్రభుత్వ భూమిలో గ్రామ అవసరాలకు 4 ఎకరాలు కేటాయించాలని కోరారు. మిగిలిన భూమిని ఇతర అవసరాలకు వాడుకోవాలని సూచించారు.

సమస్యలపై కలసిరండి

లక్కిరెడ్డిపల్లె : బడుగు, బలహీన వర్గాలు, అగ్రకుల పేదల సమస్యలపై భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల వ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలంలో బాస్ నాయకులు పర్యటించారు. బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ ఆదేశం మేరకు అన్ని మండలాల బాస్ కమిటీలు ఏర్పాటు చేసేందుకు సమావేశం అయ్యామన్నారు. అంబేడ్కర్ సేన ఆవశ్యకత గురించి, గత పది సంవత్సరాలుగా బాస్ చేసిన ఉద్యమాలు, సాధించిన విజయాలు ప్రజలకు తెలియచెబుతూ తద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కెవి రమణ, ముత్యాల మోహన్, ఎస్.సింగన్న, ధర్మ, వెంకటేష్, లాయర్ వెంకటేష్, అంజనప్ప, డ్రైవర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

- రెండో రోజుకు చేరిన క్రీడా సంబురం
- ఆసక్తికరంగా సాగుతున్న పోటీలు

సిద్దవటం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్ కోసం గ్రామస్థాయి నుంచే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి అన్నారు. మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న 11వ బెటాలియన్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ఈ కార్యక్రమాన్ని ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల యూత్ కన్వీనర్ అలం క్రిష్ణచైతన్య, ప్రధాన కార్యదర్శి కె.వి. సబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, వీఆర్‌ఓ నాని, పీడీ రామచంద్ర, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి

రామాపురం : క్రీడా స్ఫూర్తితో క్రీడలను ఆడాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తెలిపారు. బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండల పరిధి నీలకంఠ్రావుపేటలో హైస్కూల్ మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రహంతుల్లా టీం, జమీల్ టీంలు తలబడ్డాయి. రహంతుల్లా టీం నిర్ణీత ఓవర్లలో 84 పరుగులు చేయగా జమీల్ టీం అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించి విజయాన్ని కై వసం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కెప్టెన్ జమీల్ దక్కించుకున్నాడు. విజేత టీం మండల స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర క్రికెట్ మ్యాచ్‌కు చేరుకుంది. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన క్రీడా పోటీలు

పుల్లంపేట : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో భాగంగా రెండవరోజు బుధవారం మండల వ్యాప్తంగా వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ క్రీడలను వత్తలూరు, అనంతంపల్లి, పుల్లంపేట, పీవీజీపల్లి గ్రామాలలో హోరాహోరీగా సాగాయి. గెలుపొందిన విజేతలకు మండలస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తారని, అలాగే మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో ఆడించడం జరుగుతుందని ఎంపీడీఓ రఘురాం తెలిపారు.



సంబేపల్లె: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పోటాపోటీగా ఆడుదాం ఆంధ్ర

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు బుధవారం పోటాపోటీగా జరిగాయి. పెనగలూరు, చక్రంపేట హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. పెనగలూరు హైస్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ టీమ్ సభ్యులకు ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్ రావులు పలు సూచనలు, సలహాలు చేశారు. మండలస్థాయిలో గెలుపొందిన వారిని నియోజకవర్గస్థాయిలో ఆడిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, సింగనమల శివ, ఈశ్వరయ్య, సిద్దవరం రామ్మోహన్ రెడ్డి, రామరాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సాలాబాద్ గ్రామ సమీపాన ఆడుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు హాజరై అక్కడ క్రీడాకారులకు అందుతున్న మంచి నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స సామగ్రిని, క్రికెట్ కిట్లను జేసీ జి.గణేష్‌కుమార్ పరిశీలించారు. అలాగే క్రికెట్ క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నందలూరు(రాజంపేట) : విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, సర్పంచ్ ప్రతినిధి మోదుగుల చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని పాటూరు, నాగిరెడ్డిపల్లి, నందలూరు, లేబాక, పొత్తపి, టంగుటూరు, నల్లతిమ్మయ్యగారిపల్లి సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. వారు మాట్లాడుతూ క్రీడాకారులు జయాపజయాలను సమానంగా తీసుకోవాలన్నారు. ఐక్యతతో ఏదైనా సాధించవచ్చని, సమష్టి కృషితో విజయం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, ఈఓఆర్‌డీ సతీష్ కుమార్, ఆయా సచివాలయాల పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీరబల్లెలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ గాలివీటి

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు..

వీరబల్లె (రాయచోటి టౌన్) : మట్టిలో మాణిక్యాలను వెలితీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బ్యాడ్మింటన్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిలో మాణిక్యంలా గ్రామీణ క్రీడాకారులు ఉన్నారని వీరిని గుర్తించి వెలికి తీసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఆడుదాం ఆంధ్రా అన్నారు. ఈ పోటీల ద్వారా తమ ప్రతిభను చాటుకొని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకే కాకుండా జాతీయ స్థాయి వరకు ఎదిగేందుకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరాం గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు గాలివీటి ధర్మారెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

సంబేపల్లె : మండలంలోని పలు గ్రామాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వాలీబాల్, క్రికెట్, సెటిల్ తదితర ఆటలను అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. మారుమూల గ్రామాలలో సైతం క్రీడలు ఆడేందుకు యువకులు ఆసక్తి చూపుతున్నారు.



రామాపురం: గెలుపొందిన జట్టుతో నాయకులు, అధికారులు



పెనగలూరులో క్రీడాకారులకు సూచనలు చేస్తున్న అధికారులు

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో డిజిటల్ పద్ధతిలో విద్యాబోధనకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని విద్యార్థులతో కలసి రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మారెడ్డి, జెడ్పీటీసీ శివరాం, ఎస్‌ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించండి

రాయచోటి అర్బన్ : ఉద్యోగుల సమస్యలను తీర్చడంతో పాటు న్యాయంగా తమకు అందాల్సిన బకాయిలను చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు బుధవారం సాయంత్రం నేతాజీ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ అనంతరం ధర్నాను చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు దావూద్, సురేంద్రారెడ్డి, శివారెడ్డి, ప్రసాద్, హఫీజుల్లా, రాజారమేష్, రఫీలు పాల్గొన్నారు.

పసుపులేటి శంకర్‌కు డాక్టరేట్



నందలూరు(రాజంపేట): ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పసుపులేటి శంకర్‌కు ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం ఆధ్యాత్మికం, దైవత్వం రంగంలో చేసిన కృషికి గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ప్రస్తుతం శంకర్ రాజంపేట కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. ఆధ్యాత్మిక రంగంలో ఆయన చేసిన సేవలకు ప్రతిగా డాక్టరేట్ రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

గాలివీడు : మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వైద్యులు మహేష్‌నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుష్ చిన్న పిల్లల ఆసుపత్రిని ప్రారంభించారు. మాట్లాడుతూ నిరుపేదలైన రోగులకు ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి సేవా దృక్పథంతో వైద్య సేవలను అందించాలని సూచించారు. వైద్యులు లాభాపేక్షతో లేకుండా సేవానిరతితో పని చేయాలన్నారు. ఈ ప్రారంభోత్సవానికి కడప మేయర్ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు వేదమూర్తిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, చిన్నారెడ్డి, వెంకట్రెడ్డి, సోనీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డిలు

పేదల సొంతింటి కల సాకారం

జగనన్న ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బలిజపల్లె జగనన్న కాలనీలో వేముల భారతి నిర్మించిన నూతన గృహ ప్రవేశ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రతి నిరుపేద సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారన్నారు. జగనన్న కాలనీలు గ్రామాలను తలపిస్తున్నాయన్నారు.

సామాజిక సాధికార యాత్రను దిగ్విజయం చేద్దాం

లక్కిరెడ్డిపల్లె : రాయచోటిలో గురువారం జరుగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి నాయకులతో సమావేశమయ్యారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు తరలివచ్చి రాయచోటిలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సాధికార యాత్రను విజయవంతం చేయండి

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటిలో నేడు గురువారం ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గటికోట శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డిలు పిలుపునిచ్చారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్స్, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

చిన్నమండెం : రాయచోటిలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిన్నమండెం మండలం నుంచి ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాధికార బస్సు యాత్ర కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. రాయచోటి పట్టణంలోని రింగ్‌రోడ్డులో మిలాన్ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. భోజనాల అనంతరం ర్యాలీగా బంగ్లా సర్కిల్‌లో జరిగే సమావేశంలో పాల్గొనాలని దేవనాథరెడ్డి పిలుపునిచ్చారు.

రామాపురం : నేడు రాయచోటి నియోజకవర్గంలో తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రను మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు రాయచోటికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గాలివీడు : నేడు రాయచోటి నియోజకవర్గంలో తలపెట్టిన వైఎస్సార్‌సీపీ బీసీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషన్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దీన్‌లు పిలుపునిచ్చారు. మండలంలో పలు గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని తెలిపారు.

ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పనులు

ఓబులవారిపల్లె : ఐదు ఎకరాలలోపు చిన్నా, సన్నకారు రైతులకు చెందిన పొలాల్లో మామిడి మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ ద్వారా పనులు చేయిస్తామని ఏపీఓ ఆదెప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని మహిళా మేట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులు గుర్తించాలని, కనీసం నాలుగు గంటలు పనిచేయాలన్నారు. తద్వారా రోజుకు రూ. 272లు కూలీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం కూలీలకు బయోమెట్రిక్ వేయించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధి పనుల గుర్తింపునకు మహిళా మేట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళామేట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ ఆదెప్ప, వెంకటేశ్వర్లు

వినతిపత్రం అందజేత

రాజంపేట : అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కారించాలంటూ వినతి పత్రాన్ని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఇవ్వడానికి కార్యాలయంకు చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే అందుబాటులో లేరని తెలుసుకుని రూరల్ జేసీఎస్ ఇన్‌చార్జి ఎం.గంగిరెడ్డి, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి వి.రమణలకు అందజేశారు. అంగన్‌వాడీలు వినతి పత్రాన్ని ఎమ్మెల్యే మేడా ప్రభుత్వం తీసుకెళతారని వారు తెలియజేశారు.

కమ్మేసిన పొగమంచు



పొలాలను కప్పివేసిన పొగమంచు

పుల్లంపేట : చలితీవ్రత పెరుగుతుండటంతో రైతులు, వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం 9 వరకు తెల్లటి మంచు కప్పివేయడంతో వాహనదారులు తమ వాహనాలకు లైట్లు వేసినా రోడ్డుపై ఎదురుగా ఏ వాహనం వస్తోందో తెలియక ఇబ్బందులు పడ్డారు. అలాగే రైతులు సాగుచేసిన తమల పాకు పంట ఈ పొగమంచు వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా జేసీ జి.గణేష్ కుమార్

ఒంటిమిట్ట : మండల స్థాయిలో జరిగే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో ఆర్జీదారులకు సంతృప్తి కలిగే పరిష్కారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన జేసీ జి.గణేష్ కుమార్ మండల ప్రజల వద్ద నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలు మండల స్థాయిలో స్థానికంగా పరిష్కారం కావాలనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తుందన్నారు. ప్రజల నుంచి వినతులు మండల స్థాయిలోనే త్వరగా పరిష్కారం అయ్యేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సిబ్బంది ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్జీదారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గణేష్‌కుమార్

'రెగ్యులర్ చేసేవరకు సమ్మె ఆగదు'

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేసేవరకు తాము చేపడుతున్న సమ్మె ఆగదని పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ నేతలు చెన్నయ్య, రాంబాబులు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం రెండవ రోజు కార్మికులు పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నీటి సరఫరా, వీధి లైట్లు, యూజీడీ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్‌లను అందివ్వాలన్నారు. జీఓ నెం - 7 ప్రకారం క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.18,500లు వేతనంగా చెల్లించాలని, ఆప్కాస్ కార్మికులను రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ పెన్షన్‌ను ఇవ్వాలన్నారు. పర్మనెంట్ ఉద్యోగులకు సీపీఎస్ రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ కోరారు. కాగా సమ్మెకు ఎమ్మార్పీఎస్ నేత రామాంజనేయులు, రైతు సంఘం జిల్లానేత రామచంద్రలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు తిరుపాల్, వెంకటరమణ, సురేష్, శ్రీకాంత్, అశోక్, సిద్దమల్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా నిలుస్తాం

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీలకు ఎల్లవేళలా తోడుగా నిలుస్తామని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీలు అందరూ కలసి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



రైల్వేకోడూరు అర్బన్: ప్రభుత్వవిప్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ముఖ్యమంత్రి దృష్టికి డిమాండ్లు

రైల్వేకోడూరు అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అంగన్‌వాడీ వర్కర్లకు బుధవారం హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లు కొరముట్ల కార్యాలయం వద్దకు వచ్చి ఆయనకు వినతిపత్రం అందించారు. కొరముట్ల మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్లు, సమస్యలు పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కార దిశగా మార్గం చూపుతామని ఆయన పేర్కొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు సహకరించండి

రాజంపేట రూరల్ : కుష్టు వ్యాధిని ఆదిలోనే గుర్తించేందుకు ప్రజలు సహకరించాలని టీహెచ్‌ఎల్ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య కోరారు. పట్టణ పరిధిలోని మన్నూరు, ఈడిగపాళెం యూపీహెచ్‌సీల పరిధిలో గురువారం ఎల్‌సీడీసీ సర్వేను ఆమె ప్రారంభించారు. అనంతరం పలువురిని పరీక్షించారు. తదనంతరం ఆమె మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని ఎరుపు రంగు, రాగి రంగు, ఇటుక రంగు, పాలిపోయిన పొడలు లేదా మచ్చలు ఉన్నట్లయితే తక్షణమే ఏఎన్‌ఎంకు, ఆశ కార్యకర్తలు మీ ఇంటి వద్దకు వచ్చినపుడు తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీహెచ్‌ఎల్ వార్డు ఫిజియోథెరపిస్టు డీబీ గురప్ప, డాక్టర్‌లు స్నేహలత, నీరజ, యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ అశోక్‌చైతన్య, కౌన్సిలర్ బాషా, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను ప్రారంభిస్తున్న డాక్టర్ సౌజన్య